

# నమ్మకం

డాక్టర్ యన్.వి.రామరాజు

## హిందువులకు గుడిమీద
## ముస్లింలకు మసీదుమీద
## క్రైస్తవులకు చర్చిమీద-
### మా నాన్నకు నా మీద అచంచలమైన నమ్మకం!

** ** **

ఎండుటాకులు రాల్చి చెట్లు కొత్తచిగుర్లు తొడుగుతున్నాయి. కోకిలలు పోటీలు పడి మా కాలనీ మొత్తం సంగీత కచేరీలు చేస్తున్నాయి. కాంపౌండు వాల్‌కు ఆనుకున్న గుల్‌మొహర్‌చెట్టు తన పూలతో కాలనీ మొత్తం కనువిందు చేయడానికి సిద్ధమౌతుంది. ఎక్కడ చూసినా పుచ్చకాయలే! మేము కూడా వచ్చేశామంటూ! ఇంకేం కోయిలలు కూస్తే వసంతం వచ్చినట్టు పుచ్చకాయలొస్తే పరీక్షలు దగ్గర పడ్డట్టే!

మా పిల్లలకు పరీక్షలంటే శ్రీమతికి ఎక్కడ లేని టెంక్షన్! ఆమే స్వయంగా పబ్లిక్ పరీక్షలు రాస్తున్నంతగా హైరానా పడేది! తుఫాన్ రాబోయేముందు ప్రశాంతతలాగా ఇంట్లో గంభీర వాతావరణం నెలకొంది. కరెంట్ కోతలు మినహా బంద్‌లు... పోస్టుపోన్‌మెంట్లు... పేపర్ లీకేజీల్లాంటి అవాంతరాలేమీ లేకుండానే పరీక్షలు ప్రశాంతంగా ముగిసినయి.

ఇక... ఇకనుంచి ఇంట్లో శాంతి నెలకొంటుందనుకున్నాను. కానీ ఇపుడే మొదలైంది అసలైన అశాంతి! ఏడ్మిషన్‌ల సీజన్ కదా!

తెలుగు, ఇంగ్లీషు పేపర్లన్నీ దగ్గరేసుకుని హైదరాబాద్‌లోని పేరున్న ఎద్యుకేషన్ సెంటర్ల ఎడ్రెస్‌లు, ఫోన్‌నంబర్లు సేకరించి ఫోన్లు చేసి ఫీజు వివరాలు, కర్రికులం, ఏక్టివిటీస్ భోజనాలు మొదలైన విషయాలన్ని కనుక్కోవడం శ్రీమతి దినచర్య అయ్యింది. పొద్దస్తమానం ఆమెకు అదే పని.

ఇంటి దగ్గరుంటే పిల్లలు టి.వి. చూస్తూ, కంప్యూటర్ గేమ్స్ ఆడుకుంటూ, క్రికెట్ అంటూ బయట తిరిగి చెడిపోతున్నారట! అదే పెద్ద పెద్ద ఎద్యుకేషనల్ సెంటర్లో వేస్తే అన్ని టైం ప్రకారం జరిపిస్తారట! స్విమ్మింగ్... హార్స్ రైడింగ్... యోగా... మ్యూజిక్కు... కంప్యూటర్‌తో పాటు 'ఏ క్లాస్' భోజనాలు పెడతారట! క్లాసురూంలన్ని ఏ.సీ. కేనట! ఇంకా ఎన్నెన్నో ఉంటాయని అలా క్రమశిక్షణతో చదివితే పిల్లలు అమెరికానో, లండనో, ఆస్ట్రేలియానో పోయి బోల్డంత డబ్బు... పేరు సంపాదిస్తారట! శ్రీమతి అదే లోకంలో చాలా రోజులు గడిపింది. ఆమె క్షుణ్ణంగా పరిశీలించి ఓ రెండు పేరెన్నికగన్న హైటెక్ కార్పొరేట్ ఎద్యుకేషన్ సంస్థల్ని సెలెక్ట్ చేసి నాకు చూపించింది. "సరేలే! చూద్దాం ఇంకా టైం వుందిగా" అన్నాను.

ఆటలు... స్నేహితులంటూ పిల్లలు ఇంట్లో కనబడటమే లేదు. వాళ్ళు సెలవలు బాగా ఎంజాయ్ చేస్తున్నందుకు నాకు ఆనందంగానే వుంది.

** ** **

నా శ్రీమతి దగ్గరి బంధువులబ్బాయిని హైద్రాబాద్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్లో చేర్పిస్తే చెడు సావాసాలు... చెడు అలవాట్లు అబ్బాయని. అతనిప్పుడు అసలు తల్లిదండ్రుల మాటే వినడం లేదని. ఆ నోటా ఆ నోటా నలిగి శ్రీమతి చెవిలో దూరింది. ఆమె దాన్ని గోరంతలు కొండంతలు చేసి నాతో చెప్పింది. ఇంకేం ఆమె ఊహలకు బ్రేకులు పడ్డాయి. రెండ్రోజుల్నించి స్థబ్దుగా ఉండిపోయింది.

విషయం ఏమిటని ఆరా తీస్తే "తన పిన్ని కొడుక్కూడా అలాగే తయారయ్యాడని... పిల్లలు ఎవరెవరో ముక్కూ మొహం తెలీనోళ్లతో స్నేహాలు చేస్తూ సిన్మాలు, సిగరెట్లు, బీర్లంటూ బార్లంపట, పబ్‌లమ్మట అమ్మాయిలతో తిరుగుతున్నారని డాన్సులు గట్రా చేస్తున్నారని" చెప్పింది శ్రీమతి.

"ఆ హైటెక్కు ఎద్యుకేషనూ వద్దు... పాడూ వద్దు ఎంచక్కా మన ఊర్లోనే వుంచి చదివిద్దాంలే మన పెద్దబ్బాయిని ఎందుకొచ్చిన టెంక్షన్స్" అంది.

కథ

"నీ ఇష్టం... వాడెక్కడ చదివినా ఐ డోంట్ మైండ్" అన్నాను.

"అదేంటి హైద్రాబాద్‌లాంటి నగరాల్లో మనలాంటి చిన్న ఊర్ల నుంచి వెళ్లే ఏమీ తెలీని పిల్లలకు చెడు సావాసాలు... చెడు అలవాట్లు అబ్బుతాయంటగా... మా పిన్నిగారబ్బాయికూడా అలాగే ఊర్లో ఉండగా చాక్లెట్ కొనుక్కోవడానిక్కూడా బయటికెళ్లేవాడు కాదంటా... హైద్రాబాద్ వెళ్లినాకే పాడైపోయాడంట" అని మళ్లీ ఆ కేసెట్ రివైండ్ చేసింది.

నేనేం కామెంట్ చెయ్యలేదు.

"హైద్రాబాద్‌లో చేరిస్తే మనబ్బాయి పాడయిపోతాడని మీకు భయంగా లేదా?" అనడిగింది.

"ఎందుకు భయం? వాడిమీద నాకు నమ్మకముంది" అన్నాను నవ్వుతూ. పాతిక సంవత్సరాల కిందట మా నాన్న నాతో అన్న మాటలు గుర్తు చేసుకుంటూ. ఆ సంగతులు చెబుతుంటే టి.వి. చూస్తున్న పిల్లలు మా దగ్గరకొచ్చారు. మా వూరి సంగతులంటే మా పిల్లలకు చాలా ఇష్టం!

** ** **

అప్పుడు నేను గుంటూరు మెడికల్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. పరీక్షలు దగ్గర పడ్డాయి. యమ టెన్షన్‌గా వుంది.

నా స్నేహితులందరి పరిస్థితి అంతే! ఒకరితో ఒకరం మాట్లాడితేనే టైం వేస్టవుతుందన్నంత టెంక్షన్! ఇక ఇంటి సంగతేం గుర్తుంటుంది. ఇంటికి ఉత్తరాలేం రాస్తాం!

పరీక్షలు అయిపోయినయి. థీరీ, క్లినికల్స్, ఓరల్స్ బాగానే చేశా! పాసయితే హౌస్ సర్జన్. పెద్ద బరువు దిగిపోయినట్టయింది. స్నేహితుల్తో సిన్మాలు చూసి ఇంటికి బయలుదేరా! రిజల్ట్స్ రావడానికి నెల పట్టొచ్చు. మురళి నేను కల్సి రేపల్లె ప్యాసెంజర్ రైలెక్కి భట్టిప్రోలులో దిగాం! వాడు వాళ్ల అమ్మమ్మ ఊరు ఓలేరు వెళ్లిపోయాడు. నేను గూడు రిక్షా ఎక్కి బస్టాండులో మిఠాయి బండిదగ్గరాపమన్నాను. మిఠాయి కోటేశ్వర్రావు కస్టమర్లతో బిజీగా ఉన్నాడు. నన్ను చూసి చెక్కస్టూలు ముందుకు జరిపాడు. కనీసం నవ్వనైనా లేదు. ఆయన ఊతపదం 'ఇదేనా రావడం!' అని కూడా అనలేదు. బిజీగా ఉన్నాడుగా అనుకుని స్టూలుమీద కూర్చుని వచ్చేపోయే జనాల్ని చూస్తుంటే, రెండు బెల్లం జిలేబి చుట్టలు కాగితంలో పెట్టిచ్చాడు... ఆ తర్వాత చెక్క పకోడి... ఇంకేమన్న తింటావా? అంటూ... ఐటెంకొకటి చొప్పున వద్దన్నా కొసరి కొసరి చేతిలో పెట్టే కొటేశ్వర్రావు ఇంకేం మాట్లాడలేదు. ఊరి కబుర్లడిగితే ముభావంగా చెప్పాడు. అయినా రోజులు ఇదివరకటిలా లేవులే రాజూ మనుష్యులు మారిపోయారు. పట్నాలకెల్లి పెద్ద పెద్ద చదువులు చదువుతున్నారుగా..." అంటూ ఏదేదో మాట్లాడసాగాడు. ఎవరి గురించో నాకర్థం కాలేదు. మిఠాయి కోటేశ్వరర్రావు గురించి ఈ చుట్టుపక్కల ఊర్లలో తెలీని మనిషంటూ లేడు. భట్టిప్రోలు వస్తే ఆయన దగ్గర బెల్లం జిలేబి తినకుండా పోరు. ఆయనకు చుట్టుపక్కల గ్రామాల వార్తలన్ని సాయంత్రానికల్లా చేరతాయి. అందరికీ చేతనయిన సాయం చేసేవాడు. ఆలోచనల్లో ఉండగా జానీ సోడా కొట్లోంచి నిమ్మకాయసోడా తెచ్చిచ్చాడు కోటేశ్వర్రావు. వస్తానంటూ రిక్షా ఎక్కా. టి.యం.రావు స్కూలు ముందుగా రిక్షా పరిగెడుతుంది. ఆ స్కూలు ముందున్న అశోకచెట్లు ఇపుడు లేవు. కొట్టేసి కాంపౌండువాల్ కట్టినట్టున్నారు. ఆ స్కూల్లోనే నే చదివింది. రిక్షా వాలుగా గాలి పడవలాగా జోరుగా పోతుంది.

పెద్దకాలువ మీద నుంచి చల్లని గాలి వీస్తుంది. గూడు రిక్షాలో ప్రయాణం సుఖం వేరు. సిటీ రిక్షాలు ఇరుకిరుగ్గా వుండి ఎక్కిన దగ్గర నుంచి ఎప్పుడు దిగుదామా అన్నట్టుంటాయి. దూరంగా అద్దేపల్లి గుడిగోపురం, మున్సబుగారి కొబ్బరి చెట్లు కనబడుతున్నాయి. రోడ్డుకిరుపక్కలనున్న చింత, నేరేడు, మామిడిచెట్ల నీడన హాయిగా సాగుతుంది ప్రయాణం. సాలి చెరువులో ఎవరో చేపలు పడుతున్నట్టున్నారు. రిక్షా తొక్కుతున్న కుర్రోడు కొత్తకుర్రోడులాగా వున్నాడు. మా వూరువాడు కాదు. లేకపోతే గుంటూరంతా తిరగతోడేవాడే! రిక్షా ముసలమ్మ సత్రం దగ్గరకు రాగానే ఆపమన్నాను- ఆ సత్రం ముందున్న బావిలోని నీరంత రుచిగల నీళ్ల నేనింతరవకెక్కడా తాగలేదు. బొక్కెనతో చేదుకుని కడుపునిండా తాగా. కొబ్బరినీళ్లకన్నా రుచి. ఎలా వచ్చిందో-

తిరిగి రిక్షా ఎక్కి 'ఏ వూరు బ్రదర్ మనది?' అనడిగా రిక్షా తొక్కే కుర్రాడ్ని. 'వెల్లటూరండీ...' అంటూ అతను ఆ వూరి సంగతులు చెబుతూండగా- "టక టక... టక" మనే లయబద్ధమైన శబ్దాలు నాకు స్వాగతం పలుకుతున్నాయి. మా వూర్లో పద్మసాలీలు ఎనభైశాతం పైనే! అందరికీ నేతపనే... పిల్లల దగ్గర్నుంచి ముసలోల్లదాకా ఒక్కరూ ఖాళీగా వుండరు.

'ఏం అబ్బాయ్? ఇదేనా రావడం?"

'ఆc!'

**జనమంతా నా వంక దేవతా వస్త్రాల ధరించి ఏనుగుమీద ఊరేగే రాజుని చూసినట్టు అదోలా చూస్తున్నారు. వాళ్ల చూపుల్లో ఏదో తేడా ఉంది. ఆరు నెలల కిందట నేనొచ్చినప్పటికీ ఇప్పటికీ జనంలో ఏదో తేడా వచ్చింది. ఎవ్వరూ నోరు మెదపడం లేదు.**

"కోర్సు ఈ ఏడాది అయిపోయినట్టేగా?"

'ఆc! పరీక్షలయిపోయినయి.

"ఉజ్జోగం చేస్తావా సొంతంగా హాస్పిటల్ పెడతావా?"

'చూద్దాం! అపుడేనా?'


'నాలుగయిదు రోజులుంటావా?'

'ఆc!'

'ఇంటికొచ్చి కలుస్తాలే!'

"గుంటూర్నుంచేనా రావడం?"

మగ్గాలు నేస్తూ కొంతమంది, రోడ్డున పోయే జనం నన్ను పలకరిస్తూనే వున్నారు.



నేను సమాధానం చెబుతూనే ఉన్నా. అందరూ నన్నడుగుతూనే రిక్షాలోకి తొంగి చూస్తున్నారు.

ఆ ప్రశ్నల వర్షంలో తడుస్తూ ఇంటికి చేరింది రిక్షా. అందరికన్న ముందొచ్చి నా కాళ్ళు చుట్టేసింది మా పెంపుడు కుక్క టైగర్.

రిక్షా చూడగానే మా ఇంటి చుట్టుపక్కలున్న చిన్న, పెద్ద, ముసలి ముతకంతా బిలబిలమంటూ చుట్టూ మూగారు. నన్నొదిలేసి రిక్షాలోకి తొంగిచూస్తున్నారు. ఎయిర్‌బేగ్ తీసుకుని రిక్షా దిగాను.

జనమంతా నా వంక దేవతా వస్త్రాలు ధరించి ఏనుగుమీద ఊరేగే రాజుని చూసినట్టు అదోలా చూస్తున్నారు. వాళ్ల చూపుల్లో ఏదో తేడా ఉంది. ఆరు నెలల కిందట నేనొచ్చినప్పటికీ ఇప్పటికీ జనంలో ఏదో తేడా వచ్చింది. ఎవ్వరూ నోరు మెదపడం లేదు.

అంతలో ఎంకట సుబ్బయ్య తాత నా దగ్గరకొచ్చి "రాజుబాబూ ఇదేనా రావడం?" అనడిగాడు.

'అవును తాత రైలు దిగి డైరెక్టుగా ఇంటికే వచ్చా'నంటూ ఇంట్లోకి పోతుంటే- "నీకిదేమన్న బాగుందా?" అన్నాడు-

"పరీక్షలున్నాయి తాతా! అందుకే రాలేకపోయా! పరీక్షలయిపోయి నయ్‌గా వారం రోజులుండి పోతాలే! నీకు షుగర్ మాత్రలు కూడా



తెచ్చా"- అంటూ బేగ్ చూపించా!

జనమంతా కన్నార్పకుండా నా వంకే చూస్తున్నారు. ఎప్పుడూ నేనొచ్చినపుడు ఇంతమంది జనం గుమి కూడలేదు. ఏమైందబ్బా?

"అమ్మేది? నాన్నా కనబడ్డంలేదు ఏమన్న అయ్యిందా తాతా" అని ఆత్రుతగా అడిగాను.

"ఆఁ! నీ మీదే దిగులేసుకొని పచ్చి మంచినీరైనా ముట్టకుండా ఏడుస్తుంది మీ అమ్మ"- చెప్పాడు తాత.

ఇంట్లోకెళ్లాను. మంచంమీద కూర్చుని ఎదురుగ్గా స్టూలుమీద కంచం పెట్టుకుని అన్నం తింటున్నాడు నాన్న.

నా పిలుపు విన్న అమ్మ నన్ను చూసి ఒకటే ఏడుపు.

"ఎంతపని చేశావయ్యా?" మేమంతా చచ్చామనుకున్నావా?" అంటూ శోకాలు పెట్టి గుండెలు బాదుకుంటూ ఏడుస్తుంది. అమ్మ స్థితి చూసి బిత్తరపోయాను. నాన్న కంచంలో చెయ్యి కడిగేసుకుని లేచి బయటికొచ్చి నీళ్ళు పుక్కిలించి ఊశాడు.

"ప్రయాణం బాగా సాగిందయ్యా?"పరీక్షలెలా రాశావంటూ సావిట్లో ఉన్న చెక్కకుర్చీల్లో కూర్చుని దినపత్రిక అందుకున్నాడు.

"అమ్మేంటి నాన్నా అలా ఏడుస్తుంది? ఏమైంది అమ్మకు? చుట్టుపక్కలవాళ్లతో ఏమైనా గొడవలా? మన బంధువుల్లో ఎవరికైనా, ఏమైనా...?" అంటూ అడుగుతుంటే- అమ్మ ఇంక ఏడుస్తూనే వుంది.

ఇంటిముందు ఇంకొంత మంది జనం గుమిగూడారు.

సుబ్బయ్య తాత నాన్న దగ్గరకొచ్చి అడగమన్నట్టు సైగ చేస్తున్నాడు. నాన్న అదేమీ పట్టించుకోకుండా పేపర్లో నిమగ్నమైపోయాడు. అమ్మ ఏడుస్తూ నా దగ్గరకొచ్చింది. ఆమె గొంతు పూడుకుపోయింది. ముఖం పీక్కుపోయి, కళ్ళు గుంటలు పడ్డాయి. మాటలు నూతిల్లోంచి వచ్చినట్టున్నాయి.

"అసలేమైంది? ఎవ్వరూ చెప్పకపోతే నాకెట్లా తెలుస్తుంది?" అన్నాను కొంచెం కోపంగా విషయం ఏమిటో తెల్సుకుందామని.

అమ్మ నా పక్కనే కూర్చుంది ముక్కు చీదుకుంటూ.

"చెప్పాల్సింది నువ్వే అయ్యుండి తిరకాసుగా మాట్లాడుతున్నావే. నువ్వు చదివే కాలేజీలో మనూరి పంతులుగారమ్మాయి చదువుతుందా లేదా? ఆ అమ్మాయిని నువ్వు పెళ్లి చేసుకున్నావని ఊరూ వాడంతా కోడై కూస్తుంటే... నిమ్మకు నీరెత్తినట్టు... ఏం జరగనట్టు బలేగా మాట్లాడుతున్నావే?" అన్నాడు సుబ్బయ్య తాత కోపంగా. "నీ నాన్నేమో ఏమీ మాట్టాడడు. నా కొడుకట్టాంటోడు కాదంటాడు. గుంటూరు పోయి కనుక్కుందామంటే కదలడు, ఇప్పుడు చెప్పు నీ కథేంటో. నువ్వు చెప్పాల్సింది పోయి తిరగేసి మమ్మల్నే దబాయిస్తున్నవే? డాక్టరీ చదవంగానే పెద్దోడివైపోయావనుకున్నవా? మనవడా?" అంటూ- వచ్చి నాన్న పక్కన కూర్చున్నాడు సుబ్బయ్య తాత.

"పంతులుగారమ్మాయింటే పోయిన ఏడాది మా కాలేజీలో చేరిన సుబ్బలక్ష్మా?" అడిగాను..

"ఆఁ! ఎర్రగా బుర్రగా వుంటదే ఆ పిల్లే" అన్నాడు తాత కోపంగా.

బయట నిలబడ్డ జనమంతా మా దగ్గరకొచ్చేశారు. అక్కడ ఎండుపుల్ల పుటుక్కున విరిగినా కిలోమీటర్ వినబడేలాగుంది.

నాకు టెన్షన్ వీడిపోయింది. పెద్దగా నవ్వాను. సిగ్గు లేకుండా ఎదవ నవ్వొకటన్నట్టు చూస్తున్నారు చుట్టూ మూగిన జనం.

"నాన్నా ఇది నువ్వు నమ్ముతున్నావా?" అంటూ నాన్ననే సూటిగా అడిగాను. నాన్న పేపరు పక్కన పడేశాడు.

"అలాంటి పని నువ్వెందుకు చేస్తావ్? నేనెందుకు నమ్ముతాను రాజా! మీ అమ్మ వెర్రిబాగుల్దిరా ఎవరో ఏదో గాలికబురు చెబితే అదే నిజమని నమ్మి వారం నుంచి తిండీ తిప్పలు లేకుండా ఏడుస్తుంది. నీ సంగతి నాకు తెలీదా? ఒకవేళ ప్రేమించి పెళ్లి చేసుకున్నా నాకు చెప్పవా? ఈ గాలికబుర్లు నేను నమ్ముతానా? నా కొడుకు సంగతి నాకు తెలీదా?" అన్నాడు నా ముఖంలోకి సూటిగా చూస్తూ.

నాన్న నా మీద పెంచుకున్న అచంచలమైన నమ్మకానికి ముగ్ధుడినైపోయాను. ఆనందంతో నా గుండె గంతులేసింది.

"చెప్పాల్సింది నువ్వే అయ్యుండి తిరకాసుగా మాట్లాడుతున్నావే. నువ్వు చదివే కాలేజీలో మనూరి పంతులుగారమ్మాయి చదువుతుందా లేదా? ఆ అమ్మాయిని నువ్వు పెళ్లి చేసుకున్నావని ఊరూ వాడంతా కోడై కూస్తుంటే... నిమ్మకు నీరెత్తినట్టు... ఏం జరగనట్టు బలేగా మాట్లాడుతున్నావే?" అన్నాడు సుబ్బయ్య తాత కోపంగా.

వారం రోజుల క్రితం సుబ్బలక్ష్మికి మా కాలేజీలోనే చదివే రామరాజుకి పెళ్లయింది. వారి తల్లిదండ్రుల ఇష్టప్రకారమే వెంకటేశ్వర కళ్యాణ మంటపంలో జరిగిందంటూ ఆ పెళ్లి సంగతి వివరంగా చెప్పాను. అతనిపేరు నా పేరూ ఒకటే కావడం,, ఎవరో పొరపాటున నేనే అనుకుని మీకు చెప్పి వుంటారు. మీరేమో ఆ గాలి కబురు నమ్మారు. నాన్న నమ్మలేదు. చూశారా నాన్నకు నేనంటే ఎంత నమ్మకమో అంటూ అందరివంకా చూశాను.

అమ్మ ముఖం పెట్రోమాక్సు లైటులాగా వెలిగిపోయింది.

నేను చెప్పలా నా కొడుకట్టాడోడు కాదని... అంటూ నేతెచ్చిన మిఠాయిలు అందరికీ పంచింది అమ్మ.

"మిఠాయిలు కాదు- పప్పన్నం ఎప్పుడు పెడతావో చెప్పు మనవడా" అంటూ నా బుగ్గలు నిమిరాడు తాత.

"ఆ సంగతి అమ్మా నాన్నలు చూసుకుంటారులే తాతా" అన్నాను సిగ్గుపడుతూ.

** ** **

"మమ్మీ డాడీ వాళ్ల ఊరెల్లిపోయావా?" అన్న పెద్దబ్బాయి మాటల్తో ఈ లోకంలోకి వచ్చింది శ్రీమతి. ఆమె ముఖంలో ఇంతకుముందున్న ఆందోళన లేదు. నవ్వుతూ లోనికెల్లి అప్పటికే తయారుచేసిన హైటెక్ స్కూలు అప్లికేషన్ ఫారం తీసుకొచ్చి నా ముందుంచింది. సంతోషంగా సంతకం చేశా!


# మొగ్గ

పిల్లలూ ఈ నాలుగు పేజీలు, మీ కోసమే మీ విజ్ఞానం కోసం...

# పద భ్రమణం

## నిర్వహణ: గుల్ మహమ్మద్ నాయక్

25




బాలలూ! మీకోసం సరదాగా ఉండే తెలుగు 'పద భ్రమణం' శీర్షికనందిస్తున్నాం. ఆధారాల సహాయంతో మీరు దీన్ని పూర్తిచేయాలి. దీని వల్ల మీకు తెలుగు పదాలెన్నో పరిచయమయి, తెలుగులో మీ పట్టు పెరుగుతుంది. వచ్చేవారం మేం ఇచ్చే జవాబులతో మీ జవాబులను సరిచూసుకోండి. సరేనా.

**ఆధారాలు:**

**1,2,3** - బొమ్మ వంటి మనస్సు
**3,4,5** - మురశత్రువు. శ్రీకృష్ణుడు
**5,6,7** - తిరగబడ్డ వికారము వంటి సంవత్సరం
**7,8,1** - బ్రహ్మదేవుడు
**7,0,3** - గరళము

### పద భ్రమణం 24 - జవాబులు

**1,2,3** - రంగము
**3,4,5** - ముచ్చట
**5,6,7** - టముకు
**7,8,1** - కుటీరం
**7,0,3**- కుద్యము

# శాస్త్రం-శాస్త్రవేత్తలు

**జీ**వులన్నీ కణాలతో నిర్మింపబడ్డాయి. ఇవి జీవానికి ప్రాథమిక ప్రమాణాలు. సూక్ష్మదర్శినిని కనుగొన్న తరువాత జీవులలోనూ, వృక్ష జాతులలోనూ ఉన్న కణజాలాల గురించి తెలిసింది. కణాలలో ఎన్నో భాగాలు ఉంటాయి. ప్రతి కణాన్ని ఆవరించి "కణత్వం" (సెల్‌మెంబ్రీన్)

## ఆల్‌బెర్ట్ క్లాడె

జననం : ఆగస్టు 24, 1898
మరణం : మే 22, 1983
దేశం : బెల్జియం
ప్రదేశం : లాంగ్లీర్



ఉంటుంది. కణంమధ్యలో "కేంద్రకం" ఉంటుంది. వీటి రెంటికీ మధ్య "సైటోప్లాజమ్" అనే జీవ పదార్థం ఉంటుంది. దీనిలో తేలియాడే సూక్ష్మ ద్రవ్యాలు ఉంటాయి. వీటినే "మైటోకాండ్రియా" అంటారు. కణంలో ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, పోషణం వంటి శారీరక క్రియలు ఉంటాయి. వీటికి కారణం "మైటోకాండ్రియా, ఎంజైమ్"లు. ఇటువంటి జీవకణాలకు చెందిన భాగాలను వేరుచేయటం, విశ్లేషించటం మొదలైన ప్రాథమిక పద్ధతులను అభివృద్ధి చేసిన కణశాస్త్రవేత్త (సైటాలజిస్ట్) "ఆల్బెర్ట్ క్లాడె".

ఆర్థిక పరిస్థితులవల్ల క్లాడె విద్య సరిగ్గా సాగలేదు. 12 సంవత్సరాల వయసులోనే పాఠశాల చదువు ముగించాల్సి వచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటీష్ సేనల కింద రహస్య స్థావరంలో పనిచేశాడు. పాఠశాల నుండి పట్టభద్రుడు కాకుండానే "లీగే యూనివర్సిటీ" నుండి మెడికల్ డిగ్రీ పొందటానికి యుద్ధ సమయంలో చేసిన సేవలు ఉపయోగపడ్డాయి. 1928లో యం.డి. డిగ్రీ అందుకున్నాడు. అప్పుడే అమెరికా వెళ్ళి రాక్‌ఫెల్లర్ యూనివర్సిటీలో 20 సంవత్సరాలు పరిశోధనలు చేశాడు. 1941లో అమెరికా పౌరసత్వం తీసుకున్నాడు. 1949లో బెల్జియం తిరిగి వచ్చాడు. 1949 నుండి రెండు దేశాల పౌరసత్వాన్ని వినియోగించుకున్నాడు. జూల్స్‌బెరోలేట్ ఇనిస్టిట్యూట్‌కు 1948 నుండి 1971 వరకు డైరెక్టర్‌గా ఉన్నాడు. రాక్‌ఫెల్లర్ యూనివర్సిటీలోనూ, బ్రస్సెల్‌లోనూ ఉన్న యూనివర్సిటీలలో ప్రొఫెసర్‌గా పనిచేశాడు.

క్లాడె కణాలలోని భాగాలను వేరు చేయటానికి "అపకేంద్ర యంత్రాల" (సెంట్రీ ఫ్యూజెస్)ను ఉపయోగించాడు. కాన్సర్ వచ్చిన "కోడికణుతుల"లోని "రౌస్ సర్కోమా వైరస్"ను వేరు చేయటానికి ప్రయత్నించాడు. వైరస్ కలిగిన కణాల సారంలోని బరువైన కణాలు పైపొరలలో స్థిరీకరించటానికి ప్రయత్నించాడు. అపకేంద్ర యంత్రంలో వాటిని గుండ్రంగా తిప్పాడు. వైరస్ లేని సాధారణ కణాల నుండి తీసిన సారాన్ని కూడా అదేవిధంగా తిప్పాడు. రెంటినీ పోల్చి చూసి పరిశోధనలు చేశాడు. నియంత్రణకు ఉపయోగపడే సాధారణ ధాతువులలోని అనేక కణాల వంటి పదార్థాలను కనుగొన్నాడు. వాటిని "మైటోకాండ్రియా"గా భావించాడు. ఇవి శ్వాసక్రియా చైతన్యాన్ని నిర్వహించే కేంద్రాలుగా స్పష్టపరిచాడు. క్లాడె చేసిన విశ్లేషణల వల్ల కణాల లోపలి భాగంలో వల ఆకారంగా ఉన్న పలుచని పొరను కనుగొనటానికి దారి ఏర్పడింది. 1942లో అతడు ఎలక్ట్రాన్ మైక్రో స్కోప్‌ను కణాల పరిశీలనకు ఉపయోగించసాగాడు. అంతవరకు జీవశాస్త్ర సంబంధమైన పరిశోధనలలో ఈ పరికరం ఉపయోగపడలేదు. దీనితో ఎన్నో కణాలు పరీక్షించాడు. అతడి పరిశోధనల వల్ల కణంలోని ఎన్నో భాగాలు వెలుగులోకి వచ్చాయి. ఈవిధమైన పరిశోధనలకుగాను 'కాడె' తన విద్యార్థి "ఏలాడే, క్రిస్టియన్- డి-డువె"లతో కలిసి 1974లో శరీర ధర్మశాస్త్రం లేక వైద్యరంగాల్లో ఇచ్చే నోబెల్ బహుమానాన్ని అందుకున్నాడు.

**ఈ వారం సూక్తి**

పుట్టుకతోనే పిల్లల విద్యాభ్యాసం ప్రారంభమవుతుంది. -గాంధీజీ